بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

**Summary of Friday Sermon Huzur-e-Anwar 07.11.2014 (Telugu)**

**మీరు అత్యంత ప్రీతికరమైన దానిని వినియోగించనంత వరకు స్వచ్ఛమైన పుణ్యమును పొందలేరు. ఎందుకనగా దైవ ప్రాణుల పట్ల సానుభూతి, సత్‌ప్రవర్తన అధికముగా ధనమును వినియోగించు అవసరమును సూచించును. ప్రజా సేవ, దైవ ప్రాణుల పట్ల సానుభూతి విశ్వాసములో రెండవ భాగము. కనుక దీనిని ఆచరించనిదే విశ్వాసము సంపూర్ణము, ధృడము కాదు.**

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 07.11.2014 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ – లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఈ క్రింది సూక్తి పఠించిరి.

لَنْ تَنَالُوا الْبِرَّ حَتّٰى تُنْفِقُوْا مِمَّا تُحِبُّوْنَ ؕ وَمَا تُنْفِقُوْا مِنْ شَیْءٍ فَاِنَّ اللّٰهَ بِهٖ عَلِيْمٌ

(ఆలె ఇమ్రాన్: 93) అనగా మీకు అత్యంత ప్రీతికరమైన దానిని మీరు ధర్మ మార్గమున వినియోగించునంత వరకు పుణ్యమును పొందలేరు. మీరేది వినియోగించినను అల్లాహ్ దానిని నిశ్చయముగా బాగుగా ఎరుగును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం దీనిని వివరించుచు ఇట్లనిరి. ప్రపంచములో మానవుడు ధనమును అధికముగా ప్రేమించును. అందుకే స్వప్న సారాంశ విద్యలో ఇట్లు వ్రాయబడియున్నది. ఒకడు స్వప్నములో తన కాలేయము తీసి మరొకనికిచ్చినట్లు చూచినచో దీనిని ధనమని భావింతురు. అందుకే నిజమైన నిష్టాపరత, స్వచ్ఛమైన విశ్వాసము కొరకు ఇట్లు నుడివెను. لَنْ تَنَالُوا الْبِرَّ حَتّٰى تُنْفِقُوْا مِمَّا تُحِبُّوْنَ ؕ అనగా మీకు అత్యంత ప్రీతికరమైన దానిని మీరు ధర్మ మార్గమున వినియోగించునంత వరకు పుణ్యమును పొందలేరు. ఎందుకనగా దైవ ప్రాణుల పట్ల సానుభూతి, సత్‌ప్రవర్తన అధికముగా ధనమును వినియోగించు అవసరమును సూచించును. ప్రజా సేవ, దైవ ప్రాణుల పట్ల సానుభూతి విశ్వాసములో రెండవ భాగము. కనుక దీనిని ఆచరించనిదే విశ్వాసము సంపూర్ణము, ధృడము కాదు. మానవుడు త్యాగము చేయనిదే ఇతరులకెట్లు లాభము కలుగును. ఇతరుల లాభము, సానుభూతి కొరకు త్యాగము అనివార్యము. ఈ సూక్తి لَنْ تَنَالُوا الْبِرَّ حَتّٰى تُنْفِقُوْا مِمَّا تُحِبُّوْنَ ؕ లో ఈ త్యాగమునే తెలుపుచున్నది.

ధనమును అల్లాహ్ మార్గములో వినియోగించుట కూడ మానవుని అదృష్టము, నిష్టాపరతకు ప్రమాణము, సంకేతమే. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సారి ఒక అవసరమును ప్రస్తావించగా హజ్రత్ అబూబకర్ రజియల్లాహు తఆలా అన్‌హు తన గృహములోని పూర్తి ధనమును అందించుటయే వారి జీవితములో దైవ అంకిత ప్రమాణము, సంకేతము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను విశ్వసించే అనుగ్రహము మనకు లభించుట అల్లాహ్ ఉపకారము. వారు అల్లాహ్ ఆజ్ఞల, అతను బోధించిన విద్య ప్రకారము మన విశ్వాస, ఆచరణాత్మక సవరణయే కాక మన ఆధ్యాత్మిక ప్రగతి, పవిత్రత మార్గములను కూడ పవిత్ర

ఖుర్‌ఆన్ బోధన ప్రకారము మనకు నేర్పిరి. అల్లాహ్ హక్కుల గురించే కాక ప్రాణుల హక్కుల గురించి కూడ సూచించిరి. ప్రాణము, ధనము, సమయము, సంతానమును అల్లాహ్ ప్రీతిని పొందుటకు త్యాగము చేయు ఉత్సాహము కూడ కల్పించిరి. అల్లాహ్ భోధనముల ప్రకారము తన పరిస్థితులను సవరించుకొని నిజమైన అహ్మదీయులు అనబడవలెనని వారు ప్రతి అహ్మదీతో ఆశించిరి. మన జీవితములను వారి కోరిక, ఆశయం మేరకు చక్కదిద్దుకొనుటకు మనము ప్రయత్నించవలెను. నేను మొదటలో పఠించిన సూక్తి విశ్లేషణలో నేను చెప్పినట్లు మన ఆధ్యాత్మిక ప్రగతి కొరకు అల్లాహ్ మనకు విశ్వాసి బాధ్యతల వైపు దృష్టి మరల్చెను. వాటిలో ఒక బాధ్యత ధన త్యాగము కూడ గలదు. ఇది ఎంతో విశాలమైన అంశము. అల్లాహ్, అతని దాసుల హక్కులు చెల్లించుటకు ఇదొక గొప్ప సాధనమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి. ఈ సూక్తిలో ధన త్యాగము గురించి గల విషయమును నేను ప్రస్తావింతును. ప్రజా సేవ, ధర్మ ప్రచారము కొరకు ధనము అవసరముండును. ఇది హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రవచనముల సారాంశము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో ఈ కార్యములు ఉన్నత దశకు చేరవలసి యుండెను. మనము అల్లాహ్ ప్రీతిని పొందుటకు ఈ కార్యములలో పాల్గొంటున్నందుకు అహ్మదీయులవమైన మనము ఎంతో అదృష్టవంతులము. నేడు ప్రపంచము ధన వ్యామోహంలో కొట్టుకుపోతుంది. అహ్మదీయులలో అధికులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హితబోధ, శిక్షణ వలన ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెచ్చిన ధర్మ ప్రచారము కొరకు తమ ఇష్టమైన ధనమును వినియోగించుచున్నారు. ఏదో ఒక కారణముతో ఈ ధన వినియోగము తక్కువ చేయవలసి వచ్చినప్పుడు కలతకు గురై దుఃఖింతురు. జమాఅత్ సభ్యుల ఉత్సాహమిది. బలహీనత వున్నచో వ్యవస్థలో నున్నది. కాని అల్లాహ్ కృపానుసారము ప్రజల విశ్వాసములో ఎలాంటి బలహీనత లేదు.

ఈ కాలములో కూడ త్యాగ స్ఫూర్తిని అల్లాహ్ ఏ విధముగా కల్గించుచున్నాడో తెలుపు పలు సంఘటనలను నేను తెలిపెదను. (Benin) బేనిన్ అధ్యక్షులు ఇట్లు వ్రాసిరి. మష్హూది గారు పోర్తొనేవోలో పేరు ప్రఖ్యాతలు గల అహ్మదీయులు. వారు ఒక వెయ్యి పౌండ్ల కంటే అధికముగా సమర్పించిరి. ఆఫ్రీకా లాంటి దేశములలో ఇంత పెద్ద త్యాగము చాలా గొప్ప విషయము. మీరింత ఇచ్చుచున్నారు. ఇంకా వఖ్ఫె జదీద్, ఇతర చందాలు కూడ వున్నవని వారితో ముబల్లిఘ్ గారనిరి. కాని వారిట్లనిరి. నిస్సందేహముగా వున్నవి కావచ్చు. కాని నేను ఇందులో తగ్గించను. వాటికి అల్లాహ్ అందించును. వీరిలో ఏర్పడుచున్న ఉత్సాహమిది. సావె ప్రాంత మన ఒక ముబల్లిఘ్ గారిట్లు వ్రాసిరి. క్రొత్తగా చేరిన ఒక గ్రామము పీల్‌లో శిక్షణా సమావేశము నిర్వహించబడెను. తహ్‌రీకె జదీద్ చరిత్రాత్మక నేపథ్యము, ధన త్యాగ ప్రాముఖ్యత తెలుపబడెను. సమావేశ ముగింపులో మిత్రులు తమ తమ చందా అందించిరి. ఒక మిత్రడు ఇట్లనెను. నా వద్ద నగదు లేదు కాని చందా ఇవ్వాలనే కోరిక గలదు. స్థోమత ప్రకారము చందా ఇవ్వగలరని ముబల్లిఘ్ గారనిరి. అప్పుడు ఆ మిత్రులు ఇంటికి వెళ్ళి రెండు కోడి గుడ్లు తెచ్చిచ్చి ఇవే నా దగ్గర వున్నవని అనిరి. వారి స్థోమత ప్రకారము ఇది పెద్ద త్యాగమే, సదుద్దేశమున్నచో అల్లాహ్ దృష్టిలో ఏ త్యాగము చిన్నది కాదని వారికి, జమాఅత్‌కు చెప్పనైనది. మాలీ నుండి ఒక నివేదిక ఇట్లుందినది. ఒక ప్రాచీన అహ్మది అబూబకర్ జార గారు ఏదో ఒక కారణముతో చందా ఇవ్వడం మానేసి, చిన్న చిన్నగా జమాఅత్ కార్యక్రమాలలో పాల్గొనడం కూడ వదిలిరి. వారికి ఎంత నచ్చ చెప్పినా వారిలో మార్పు రాలేదు. కొంత కాలము తర్వాత వారొక రోజు మిషన్‌కు వచ్చి తన చందా ఇచి ఇట్లు చెప్పిరి. నేటి రాత్రి వారు స్వప్నము చూసిరి. వారు చాలా లోతైన నీటిలో మునుగుచున్నారు. వారిని రక్షించుటకు ఎవరు రావడం లేదు.

ఇంతలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూర్చొని వున్న నావను వారు చూచిరి. హుజూర్ వారి హస్తమును పట్టుకొని నావలో ఎక్కించుకొని ఇట్లనిరి. ఇక ముందెన్నడు చందా ఇచ్చుటలో అలసత్వము ప్రదర్శించకుము. భవిష్యత్తులో చందా చెల్లించుటలో అలసత్వము చూపనని, జమాఅత్ కార్యక్రమములలో నిర్లక్ష్యము వహించనని ఈ స్వప్నము తర్వాత వారు గట్టి వాగ్దానము చేసిరి.

ఒక వైపు ఇది చందా ప్రాముఖ్యతకు సాక్ష్యము కాగా మరో వైపు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సత్యపు సాక్ష్యము కూడ. సుదూర దేశములోని అతి దూర ప్రాంతములోని ఒక వ్యక్తి అహ్మదియ్యత్‌ను స్వీకరించి, మరల వెనుకడుగు వేసినప్పుడు అతనికి స్వప్నము ద్వారా మార్గదర్శనము చేయబడెను. దారుస్సలాం తన్జానియా ఒక మిత్రులు ఈసా గారిట్లు వ్రాసిరి. వారు 90వ దశకంలో అహ్మదియ్యత్‌ను స్వీకరించిరి. అంతకు ముందు వారు క్రైస్తవులుగా నుండిరి. కాని అహ్మదీ స్వీకరించిన తర్వాత విశ్వాసములో ఎంతో అభివృద్ధి చెందిరి. అల్లాహ్ దయానుగ్రహము ఇప్పుడు వసియ్యత్ చేసి, ధన త్యాగము చేయుచున్నారు. తన, తన కుటుంబ చందా ఎల్లప్పుడు వాగ్దానము కంటే ఎక్కువ చెల్లింతురు. జమాఅత్ బోధనలను పాటించుటలో పాత అహ్మదీయుల కంటే ముందున్నారు. దారుస్సలాం తన్జానియా ప్రాంత అధ్యక్షులు కూడ ఇట్లు వ్రాసిరి. దైవ మార్గములో నేను ధన త్యాగము చేయుచున్నప్పటి నుండి అల్లాహ్ అనుగ్రహములు అవతరించునట్లు నేను చూచుచున్నాను. అలాడ ప్రాంత ముబల్లిఘ్ ఇట్లనిరి. ఒక సారి వారు సోయూ జమాఅత్‌లో పర్యటించిరి. పిల్లల హృదయాలలో అల్లాహ్ ఎట్లు ఆలోచనలు కలిగించుచున్నాడో చూడండి! 7 సం॥ల ఒక బాలిక రాషిదహ్ టమాటాలు, మిరపకాయలు, మాల్టె తీసుకొచ్చి వీటన్నిటిని చందా తహ్‌రీకె జదీద్ కొరకు తెచ్చినానని అనెను. ఈ బాలిక ప్రతి నెల చందా ఇస్తుంది. ఆమె తల్లి చందా డబ్బులు ఇవ్వనిచో రోధించునని అక్కడి అధ్యక్షులు తెలిపిరి.

నైజేరియాలోని ఓకియో జమాఅత్ అధ్యక్షులు ఇట్లనిరి. నేను కొంత కాలము ఆర్థిక కష్టములతో సతమతమగుచుంటిని. కనుక చాలా ఇబ్బందులు ఎదురయ్యెను. నేను 3 నెలల నుండి చందా ఇవ్వలేదు, దీని వల్లనే నాకు ఈ ఆర్థిక ఇబ్బందులు వచ్చినవి కావచ్చునని నాకొక రోజు ఆలోచన వచ్చినది.. అందు వలన 3 నెలల తర్వాత 4 వేల నాయిర చందా చెల్లించితిని. దైవికముగా అదే నెలలో నేనొక స్థలమును విక్రయించియుంటిని. దానిపై నాకు నా అల్లాహ్ 8 లక్షల లాభము అందించెను. అప్పుడు నా విశ్వాసము గట్టి పడడమే గాక అల్లాహ్ సత్యమైన వాగ్దానములు చేయువాడు, అతని మార్గములో త్యాగము చేసినచో అనేక రెట్లు పెంచి ఇచ్చునని నాకు తెలిసెను. వారిప్పుడు మస్జిద్, మిషన్ హౌజ్ కొరకు నగర ప్రాంతములో ఒక పెద్ద ప్లాట్ తీసుకొని ఇచ్చిరి. తన్జానియా నుండి ఒక అహ్మదీ మారొండా గారిట్లు వ్రాసిరి. నేను 10వ తరగతి వరకు చదువుకున్నాను. చాలా కాలము నుండి నిరుద్యోగిగా యుంటిని. ఒక గ్యాస్ కంపనీలో నాకు సెక్యూరిటి గార్డ్ ఉద్యోగము లభించినది. 56 వేల షలింగ్ వేతనము నిర్ణయించబడెను. నేను నిబంధన ప్రకారము నా వేతనము నుండి చందా చెల్లింతును, నాకెలాంటి సమస్యలు ఎదురైనా చందా చెల్లింపులో నేను అలసత్వము పాటించనని అప్పుడే ప్రతిజ్ఞ చేసితిని. ఈ విధముగా ఆ యువకుడు తన ప్రతిజ్ఞనను పాటించెను. వారిట్లు తెలిపిరి. అల్లాహ్ కృపానుసారము ఇదే ధన త్యాగము వలన ఆ గ్యాస్ కంపనీలో నేడు నేను సీనియర్ ఫీల్డ్ గ్యాస్ ఆపరేటర్ పదవిపై వున్నాను. నాకు ఒకటిన్నర మిలియన్ షిలింగ్ వేతనము లభించుచున్నది. నా విద్యార్హత 10వ తరగతే. కంపనీ నిబంధనల ప్రకారము నేనీ పదవికి అనర్హున్ని. కాని అల్లాహ్ కృపానుసారము, నిబంధన ప్రకారము ధన త్యాగపు శుభముల వలన నేనీ పదవిపై వున్నాను. నేడు కూడ నిబంధన ప్రకారము చందా ఇచ్చుచున్నాను. వీరు విధేయత,

విశ్వసనీయతలో అభివృద్ధి చెందుచున్నారు. وَأَنفِقُوا خَيْرًا لِّأَنفُسِكُمْ తమ ధనమును అతని మార్గములో వినియోగించుము. ఇది మీ ప్రాణములకు మంచిది. వీరు దీనిని అర్థము చేసుకొను వారు. వీరీ ఈ రహస్యమును అర్థము చేసుకొనువారు. అల్లాహ్ కూడ వీరిని కరుణించును. ఇండియా నుండి తహ్‌రీకె జదీద్ ఇన్స్‌పెక్టర్ షహాబుద్దీన్ గారిట్లు వ్రాసిరి. జడ్చర్ల జమాఅత్ వినమ్రులైన ఒక మిత్రుడు తమ రియల్ స్టేట్ వ్యాపారము ప్రభావితమైనందున ఎన్నో నెలల నుండి చాలా ఇబ్బంది పడుచుండిరి. చందాలు చెల్లించుటకు ఫోన్ చేసి ప్రార్థన కొరకు గుర్తు చేసేవారు. నాకు కూడ వారు ప్రార్థన కొరకు వ్రాసిరి. ఒక రోజు రాత్రి వారు ఫోన్ చేసి నేనిప్పుడే కలవాలని అనిరి. మీరు అల్లాహ్‌పై నమ్మకముంచుకొని రెండు రకాతులు నఫిల్ చదివి నిద్రించండని వారనిరి. మరల కొద్ది సమయము తర్వాత నాకు ఫోన్ చేసి నేను తమరిని కలుసుకొనుటకు వచ్చుచున్నాను. మీరు నా కొరకు కొంత సమయము వరకు నిద్రించకండని అనిరి. వారు వచ్చినప్పుడు వారి చేతిలో భారీ నగదు యుండెను. వారిట్లనిరి. నేను ప్రార్థన చేయుచున్నప్పుడు ఒక ధనిక వ్యాపారస్తుడు నాకు ఫోన్ చేసి వెంటనే వచ్చి నీ నగదు తీసుకెళ్ళు అని చెప్పెను. అతని నుండి నాకు పెద్ద మొత్తములో నగదు రావలసి యుండెను. కాని వచ్చే నమ్మకము నాకు లేకుండెను. చందా ఇచ్చే ఉద్దేశము నాకున్నందున తక్షణమే అల్లాహ్ ఈ ఏర్పాటు చేసెనని వారనిరి.

బషీరుద్దీన్ నాయిబ్ వకీలుల్ మాల్ ఖాదియాన్ గారిట్లనిరి. జమాఅత్‌లోని ఒక మిత్రుడు వాగ్దానము కంటే రెండున్నర రెట్లు అధికముగా తమ చందా వ్రాయించి తమ కార్యాలయమునకు పోయిరి. అక్కడికి చేరుకున్న తర్వాత వెంటనే తహ్‌రీకె జదీద్ కార్యదర్శికి ఫోన్ చేసి ఇట్లు చెపిరి. వారు వాగ్దానము వ్రాయించి మస్జిద్ నుండి బయలు దేరగానే నాకు నా వ్యాపారములో మరింత లాభము వచ్చినట్లు తెలిసినది. ఇదంతా నిశ్చయముగా అల్లాహ్ ప్రత్యేక అనుగ్రహము, తహ్‌రీకె జదీద్ శుభము వలన జరిగినదని నేను విశ్వసించుచున్నాను. కనుక నా చందా రెట్టింపు చేయగలరు. రెండున్నర రెట్టు ముందుగానే పెంచి, ఇప్పుడు రెట్టింపు చేసిరి. అల్లాహ్ దయానుగ్రహము మొత్తము చెల్లించిరి కూడ. ఇండియాలోని కేరళకు చెందిన ఒక మురబ్బి ఇట్లు వ్రాసిరి. ఒక జమాఅత్ త్యాగమూర్తి మిత్రులు గత సం॥ కంటే రెట్టింపు చందా తహ్‌రీకె జదీద్ చెల్లించిరి. అల్లాహ్ కృపానుసారము ఈ సం॥ కూడ అసాధారణ హెచ్చుతో చెల్లించిరి. వీరిట్లు చెప్పిరి. 7 సం॥ల క్రితం 30 వేల రూ॥లతో ముగ్గురు కూలీలతో తమ వ్యాపారము మొదలు పెట్టితిని. అల్లాహ్ కృపానుసారము ఇప్పుడు ఇండియా, దుబై, ఇండోనేషియాలో రోర్ వుడ్ 8 ఫ్యాక్టరీలున్నవి. వీటిలో 500 కంటే అధిక కార్మికులు పని చేయుచున్నారు. మీరు చూచుచున్న ఈ అభివృద్ధి నిబంధన ప్రకారము చందా చెల్లించిన ఫలితమే. నేనెప్పుడు చందా చెల్లించినా సాయంత్రము లోపు ఎన్నో రెట్లు అధికముగా సదా అల్లాహ్ నాకందించును. నేనెప్పుడు ఆర్థిక ఇబ్బందిని చూడలేదు. మన స్త్రీలు ఎట్లు త్యాగము చేయుచున్నారు. లాహోర్ అధ్యక్షులు ఇట్లు వ్రాసిరి. ఒక స్త్రీ తహ్‌రీకె జదీద్ చందాలో తమ చెవి కమ్మలు అందించెను. అల్లాహ్ వారి ధనములో శుభము కల్గించి, వారి త్యాగమును స్వీకరించు గాక! తహ్‌రీకె జదీద్ జర్మనీ జాతీయ కార్యదర్శి ఇట్లు వ్రాసిరి. ఒక రుణగ్రహీత మిత్రుని సంఘటన ఇట్లు గలదు. వారు తహ్‌రీకె జదీద్‌లో తమ ప్రత్యేక వాగ్దానము వ్రాయించిరి. అల్లాహ్ వారికెంత అందించెననగా మొత్తము రుణము చెల్లించబడెను. వారికి అసాధ్యముగా నున్న క్రొత్త గృహము కొనుగోలు చేసే అనుగ్రహము లభించినది.

స్విట్జర్‌ల్యాండ్ ముబల్లిఘ్ ఇన్చార్జి ఇట్లు వ్రాసిరి. బేతం రెడ్జ్ పప్పి గారు మగ్దూనీన్ వంశ స్విస్ దేశస్తులు.

గత సం౹౹ అక్టోబర్‌లో వారు బైఅత్ చేసిరి. తహ్‌రీకె జదీద్ సం౹౹ ముగింపునకు 5 రోజులు మాత్రమే మగిలి యుండెను. జమాఅత్‌లో చేరగానే ఒక వెయ్యి స్విస్ ఫ్రాన్క్ అసాధారణ నగదు వాగ్దానము చేయకుండానే తహ్‌రీకె జదీద్‌లో చెల్లించిరి. వచ్చే సం౹౹లో కూడ వెయ్యి వాగ్దానము వ్రాయించిరి. సం౹౹ మధ్యలో తహ్‌రీకె జదీద్ ప్రాముఖ్యత తెలిసినందున తన వాగ్దానమును రెట్టింపు చేసిరి. తహ్‌రీకె జదీద్‌తో పాటు వఖ్ఫె జదీద్ చందా కూడ రెండు వేల ఫ్రాన్క్ వ్రాయించిరి. వారు పని చేయుచున్న కంపనీ ఎంతో విలువైన కోర్సును అందించెను. అనుభవముండి, 35 సం౹౹ల వయసు దాటిన వారికి మాత్రమే ఈ కంపనీ ఈ కోర్సు చేయించును. కాని నా వయసు 23 సం౹౹లు. నేను ఈ కోర్సు గురించి ఆలోచించనే లేదు. కంపనీ స్వయముగా ఈ కోర్సును నాకందించెను. ధన త్యాగ ఫలితము వల్లనే అల్లాహ్ నాకిది ప్రసాదించెను.

యూరప్‌లో కూడ క్రొత్తగా వచ్చువారికి అల్లాహ్ ఈ విధముగా తన ఉనికి పట్ల నమ్మకము కల్గించు చున్నాడు. మగ్దూనీన్ (Swiss) స్విస్ అహ్మదీ బేక్‌హం గారిట్లనిరి. నేను పని చేయుచున్న కంపనీ యజమాని చాలా లోభి, కఠిన హృదయుడు. ఎటువంటి బాహ్య కారణము లేనిదే నా వేతనము పెంచెను. ఇది ధన త్యాగ ఫలితమేనని నేను భావించుచున్నాను. రీజ్నల్ అమీర్ లండన్ నసీరుద్దీన్ గారు ఒక మిత్రుని సంఘటన ఇట్లు వ్రాసిరి. తహ్‌రీకె జదీద్ చందా విషయములో నాకు సహకరించుమని ఒక అహ్మదీ మిత్రుడు అల్లాహ్‌తో చాలా ప్రార్థన చేసెను. కార్యాలయానికి వెళ్ళే సమయమున రైలులో ప్రయాణించక బస్సులో ప్రయాణించాలని తద్వారా సౌలభ్యమే కాకా కిరాయ కూడ మిగులునని అల్లాహ్ నాకు ఆలోచన కల్గించెను. ఇటుల రోజు 2 పౌండ్లు మిగిలినవి. మొత్తం 400 పౌండ్లు మిగలగా తహ్‌రీకె జదీద్ చందా ఇచ్చినాను. ఈ కోణంలో కూడ ప్రజలు ఆలోచింతురు. ఇక్కడ లండన్‌లో ఒక వ్యక్తి ఇంట్లో దోపిడి చేసి మొత్తం ఎత్తుకెళ్లినారు. తహ్‌రీకె జదీద్ చందా కొరకు కేటాయించిన వెయ్యి పౌండ్లు భద్రముగా నున్నవి. ఆస్ట్రేలియా మిషనరీ ఇన్చార్జి ఇట్లు వ్రాసిరి. ఖుద్దాముల్ అహ్మదియ్య ఇజ్తిమాలో నేను తహ్‌రీకె జదీద్ చందా వైపు ఖుద్దామ్ (యువకులు), అత్ఫాల్ (బాలలు) కు సూచించియుంటిని. వోచర్స్ రూపంలో బహుమానములు కూడ ఇవ్వబడినవి. ప్రస్తావించదగ్గ ముగ్గురు బాలలు అర్సలాన్, ఆతిఫ్, కామ్రాన్ గలరు. వీరికి 89 డాలర్ల బహుమానములు లభించినవి. సూచించిన తర్వాత ఈ ముగ్గురు బాలలు తమ వద్ద నున్న 11 డాలర్లు కలిపి మొత్తం 100 డాలర్లు తహ్‌రీకె జదీద్ చందాలో ఇచ్చిరి. ఎన్నో సంఘటనల నుండి ఈ కొన్నిటిని ప్రస్తావించినాను. పాత అహ్మదీయులు మాత్రమే త్యాగము చేయడం లేదు, నేను చెప్పినట్లు ఆఫ్రికా, యూరప్‌లో కూడ క్రొత్తగా చేరు బాలలు, స్త్రీలు కూడ ఆశ్చర్యకర రీతిలో త్యాగములు చేయుచున్నారు.

తహ్‌రీకె జదీద్ నూతన సం౹౹ నవంబర్‌లో మొదలగునను విషయము మనకు తెలుసు. ఇప్పుడు నేను తహ్‌రీకె జదీద్ గత సం౹౹ ముగింపు క్రొత్త సం౹౹ ఆరంభమును ప్రకటింతును. తహ్‌రీకె జదీద్ 80వ సం౹౹ 31 అక్టోబర్ 2014తో ముగిసినది. నివేదికల అనుసారము 84,70,800 పౌండ్ల ధన త్యాగము జమాఅత్ చేసినది. అల్‌హందులిల్లాహ్. ఇది గత సం౹౹ కంటే 6 లక్షల ఒక వెయ్యి కొన్ని వందలు అధికం. ఇబ్బందులున్నను పాకిస్తాన్ ప్రథమ స్థానంలో నున్నది. పాకిస్తాన్ తర్వాత 1.జర్మని, 2.ఇంగ్లాండ్, గత సం౹౹ ఇంగ్లాండ్ 3వ స్థానంలో యుండెను. ఇప్పుడు రెండవ స్థానం పొందినది. 3.అమెరికా, 4.కెనడా, 5.ఇండియా, 6.ఇండోనేషియా, 7.ఆస్ట్రేలియా, ఆస్ట్రేలియా కూడ ఒక అడుగు ముందుకు రాగా ఇండోనేషియా వెనక్కి పోయినది. ఆ తర్వాత మిడిల్ ఈస్ట్ కొన్ని జమాఅతులు గలవు. తర్వాత 8.స్విట్జర్‌ల్యాండ్, 9.ఘూనా, 10.నైజేరియా వచ్చినవి. కరెన్సీ

వసూలు పరంగా 50% అదనపుతో ఘానా ప్రథమ స్థానంలో వుండగా 44%తో ఆస్ట్రేలియా ద్వితీయ, తర్వాత మిడిల్ ఈస్ట్ జమాఅతులు. 17%తో స్విట్జర్ల్యాండ్, 15%తో పాకిస్తాన్, 14%తో యు.కె. 13.75%తో ఇండోనేషియా, తర్వాత ఇండియా, జర్మనీ సమానముగా నున్నవి. కెనడా చివరి స్థానంలో గలదు. తల సరి చందా ప్రకారము అమెరికా ప్రథమ, స్విట్జర్ల్యాండ్ ద్వితీయ, ఆస్ట్రేలియా తృతీయ స్థానములను కైవసం చేసుకొన్నవి.

గత రెండు మూడు సం॥ల నుండి తహ్‌రీకె జదీద్, వఖ్ఫె జదీద్ చందాదారుల సంఖ్య పెంచాలని నేను సూచించుచున్నాను. నగదు పెరిగినదా లేదా అని చూడక చందాదారుల సంఖ్య పెరుగుచున్నదా లేదా చూడవలెను. అల్లాహ్ కృపానుసారము ఈ సం॥ ఈ సంఖ్య 12 లక్షల 11 వేల 7 వందలైనది. క్రొత్తగా చేరిన వారిలో గత 4 సం॥లలో 6 లక్షల సంఖ్య పెరిగినది. ప్రథమ కార్యాలయములోని సంఖ్య 5,927. నివేదిక అనుసారము వీరిలో 105గురు ఇంకా జీవించియున్నారు. అల్‌హందులిల్లాహ్. మృతి చెందిన 5,822 మంది ఖాతాలు వారి వారసులు లేదా జమాఅత్ ఇతర పుణ్య సభ్యుల ద్వారా కొనసాగుచున్నవి. ఇండియాలో మొదటి పది స్థానములను పొందిన రాష్ట్రములు ఇట్లు గలవు. 1.కేరళ, 2.తమిల్‌నాడు, 3.కర్నాటక్, 4.ఆంధ్ర ప్రదేశ్, 5.జమ్ముకాష్మీర్, 6.ఒడిశా. 7.వెస్ట్ బంగాల్, 8.పంజాబ్, 9.ఢిల్లీ, 10.లక్షదీవ్. మొదటి పది స్థానములు పొందిన జమాఅతులు. 1.కరులాయి, 2.కాలికట్, 3.హైద్రాబాద్, 4.ఖాదియాన్, 6.కన్నానూర్ టౌన్, 7.పైంగాడి, 8.సోలూర్ కల్కత్త, 9.చెన్నై, 10.బంగళూరు. ఈ ధన త్యాగము చేయు వీరందరికి త్యాగములను అల్లాహ్ ఆమోదించుగాక! వీరి ధనము, కుటుంబములో అల్లాహ్ శుభము కల్గించుగాక! ఈ ధనమును సరైన రీతిలో వినియోగించే అనుగ్రహము బాధ్యులకు కల్గించుగాక!

ప్రార్థనల తర్వాత నేనొక పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చేయింతును. మన ఒక లోకల్ ముఅల్లిమ్/ముబల్లిఘ్ గౌ॥ అల్‌హాజ్ యూసుఫ్ అడోసిటి ఘానా గారు 2 నవంబర్ రాత్రి పావు తక్కువ 12 గం॥లకు సహజ మృతి చెందిరి. إِنَّا لِلّٰهِ وَإِنَّا إِلَيْهِ رَاجِعُوْنَ ఒక క్రైస్తవ కుటుంబములో 15 డిశంబర్ 1942 తేదీన జన్మించిరి. 16 సం॥ వయసులో అహ్మదియ్యత్‌ను స్వీకరించే అనుగ్రహము పొందిరి. 20 సం॥ వయసులో వారు జామిఅతుల్ ముబష్షిరీన్ ఘానాలో విద్యాభ్యాసం పూర్తి చేసిరి. హుజూరె అన్వర్ వారి సద్గుణములను, సేవలను క్లుప్తముగా ప్రస్తావించిరి. అల్లాహ్ కీ.శే.ని స్థానములను పెంచాలని, వారి సంతానము కూడ విధేయత, విశ్వసనీయతలో అభివృద్ధి చెందుగాక! (ఆమీన్).

☼☼☼

*Summary: Majlis Ansarullah Bharat, Translation:Hafiz Syed Rasool Niyaz, (Telugu Desk)*

Published by: Nazarath Nashr-O-Isha'ath, e-mail:telugudesk@yahoo.in
P.O.:Qadian, Dist:Gurdaspur, Pin:143516, Punjab, Mob 84376 99866

BOOK POST (PRINTED MATTER)

*To,*

........................................................................................

........................................................................................